నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, శుక్రవారం 9 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET



అచ్చంపేటలో ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేస్తున్న యువకులు

మహబూబ్‌నగర్, మే 8 : ఏ నోట విన్నా ఆపరేషన్ సిందూర్ అన్న మాటే వినిపిస్తోంది. భారత సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ.. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు, మాజీ సైనికులు తాము సైతం సైనిక దళాలలకు అండగా అన్నట్లు సామాజిక మాధ్యమాలు, ర్యాలీలు, విజయోత్సవ సంబురాలతో తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. 'ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌లో ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా భారత సైన్యంపై పొగడ్తల వర్షం కురిపించారు.

## యుద్ధం అనివార్యమైతే మళ్లీ వెళ్లేందుకు సిద్ధం..



25 ఫిబ్రవరి 1998లో సైన్యంలో సిఫాయిగా చేరా. ఓపీ రక్షక్ 1999నుంచి జనవరి 2001 వరకు జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న. ఓపీ విజయ్, ఓపీ పరాక్రమ్ యుద్ధాల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొన్న. హవాల్దార్ హోదాలో రిటైర్డ్ అయ్యాను. యుద్ధం అనివార్యమేతే మళ్లీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా. మన సైనిక శక్తి ముందు పాకిస్తాన్ నిలబడదు. యుద్ధం వస్తే ఎవరూ భయపడొద్దు. భారత సైన్యం అన్ని రంగాల్లో బలమైంది. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొంటుంది. మాజీ సైనికుల సేవలను కూడా పాలకులు తీసుకుంటారు. త్రివిధ దళాలు దేశ రక్షణకు పాటుపడతాయి. ఒకవేళ పూర్తిస్థాయి యుద్ధం వస్తే పెట్రోల్ బంకుల వంటి ప్రదేశాల్లో ఉండవద్దు. ఇంట్లో వంటగ్యాస్ సిలిండర్ ఆఫ్ చేసుకోవాలి. ఉపగ్రహ చిత్రాల ద్వారా దాడులు చేసే అవకాశాలున్నందునా గుంపులుగా బయట తిరగొద్దు. **– కె.శాంతయ్య, ఖానాపూర్, బిజినేపలి.**

# గన్నీ బ్యాగులివ్వరూ..


మరికల్ మండలం తీలేరు సింగిల్ విండో ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

- **తూకం చేసిన ధాన్యం ఎత్తేందుకు లారీలు రావు**
- **అకాల వర్షాలతో నష్టపోతున్నాం**
- **తీలేరు సింగిల్ విండో కార్యాలయం ఎదుట రైతుల నిరసన**

మరికల్, మే 8 : గన్నీ బ్యాగుల్వీరు.. అరకొరగా ఇచ్చి తూకం చేసినా ధాన్యం ఎత్తేందుకు లారీలు రావు.. అకాల వర్షాలతో నిండా మునుగుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికల్ మండలంలోని తీలేరు సింగిల్ విండో పరిధిలో రైతులకు సరిపడా గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, తూకం చేసినా లారీలు రావడం లేదని నిరసిస్తూ గురువారం విండో కార్యాలయం ఎదుట అన్నదాతలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గన్నీ బ్యాగుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు కావాలంటే డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. పంట కోసం 15 రోజులు గడిచినా ఇప్పటికీ కొనకపోతే ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికే వడగండ్ల వర్షానికి ధాన్యం తడిసిందని, మళ్లీ ఆరబెట్టినా ఇప్పటికీ కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదని చింతకుంటకు చెందిన రైతు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లే లారీలు రావడం లేదన్నారు.

ఈ విషయమై సింగిల్ విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్, సీఈవో కృష్ణయ్యను వివరణ కోరగా, ఇప్పటి వరకు 3లక్షల గన్నీ బ్యాగులు ఇచ్చామని, మరో లక్ష గన్నీ బ్యాగులు కొనుగోలు కేంద్రాలకు రావాల్సి ఉన్నదన్నారు. పెద్దచింతకుంటకు 20వేల గన్నీ బ్యాగులు అవసరముందని, త్వరలోనే తెప్పిస్తామన్నారు. అయితే లారీల సమస్య ఉందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నారని తెలిపారు.

# లారీల కాంట్రాక్టర్‌పై రైతుల దాడి

- **ధాన్యం తరలించాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్**
- **సీఎం తమ్ముడు తనకు తెలుసని అన్నదాతలకు బెదిరింపు**
- **ఆగ్రహించి చితకబాదిన రైతులు**


మిల్లు యజమానితో వాగ్వాదానికి దిగిన రైతులు

మాగనూరు, మే 8 : ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీల కాంట్రాక్టర్ ఒక్కో రైతు నుంచి రూ.10వేల వరకు డిమాండ్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతుండంతో అన్నదాతలు ఆగ్రహించారు. వ్యయప్రయాసాలకోర్చి పంటను పండించి అమ్ముకుందామంటే లారీలు ఇవ్వకుండా డబ్బులు వసూలు చేస్తారా అంటూ కాంట్రాక్టర్‌పై దాడికి పాల్పడిన ఘటన మాగనూరులో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా.. బుధవారం రాత్రి టైరోడ్డులో ధాన్యాన్ని తరలించేందుకు లారీ లు సమాకూర్చిన కాంట్రాక్టర్, డ్రైవర్లు కలిసి ధాన్యం తరలించాలంటే రూ.10వేలు కావాలని డిమాండ్ చేశారు. లేదంటే ధాన్యం తరలించేది లేదంటూ చెప్పాడు. అంతేకాకుండా సీఎం తమ్ముడు నాకు బాగా తెలుసని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోడంటూ రైతులను దుర్భాషలాడాడని తెలిపారు. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు రైతులంటే అంత చిన్నచూపా అంటూ కాంట్రాక్టర్‌పై దాడికి దిగారు.

### రైస్‌మిల్లు వద్ద రైతుల ఆందోళన

రైస్ మిల్లుల్లో వడ్లను దింపుకోవడం లేదని మాగనూర్, కృష్ణ మండలాల రైతులు గుడెబల్లూరు పారాజన్య రైస్ మిల్ యజమానులతో వాగ్వాదానికి దిగిన ఘటన గురువారం మధ్యాహ్నం చేసుకున్నది. కేవలం కొన్ని వాహనాల ధాన్యం మాత్రమే దింపుకొంటూ మిగతావి తీసుకోవడం లేదని గుడెబల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై దాదాపు 100 మంది రైతులు ధర్నా చేపట్టే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై నవీద్ ఘటనా స్థలానికి చేరుకొని మిల్లు యజమానులతో మాట్లాడారు. ధాన్యం దింపుకొనేలా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

- **ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో జిల్లాల్లో భారీ బందోబస్తు**
- **సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా**
- **అనుచిత పోస్టులు చేయొద్దని హెచ్చరిక**
- **అనుమానాస్పద వ్యక్తులపై ఫోకస్**
- **భద్రతకు పకడ్బందీ చర్యలు**
- **మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి**



# హై అలర్ట్

మహబూబ్‌నగర్, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఎస్పీలతోపాటు ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేస్తున్నది. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిఘావర్గాలు చెబుతున్నాయి. అపరిచితులకు, గుర్తింపుకార్డు లేని వారికి హోటళ్లలో వసతులు కల్పించవద్దని హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు ఆయా జిల్లాల పోలీసు యంత్రాంగం సోషల్ మీడియా పోస్టులపై, మీడియాలో వచ్చే వార్తలపై నిఘా ముమ్మరం చేశారు. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆయాచోట్ల ర్యాలీలు నిర్వహించారు. మన జవాన్లకు సంఘీభావం ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని గ్రామాల్లో సైతం ప్రజలు ఆపరేషన్ సిందూర్‌పై చర్చించుకుంటున్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి అమాయకులైన టూరిస్టులను పొట్టన పెట్టుకోవడంపై భారత్ ప్రభుత్వం చేసిన చర్యను ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు.

### సోషల్ మీడియాపై పోలీస్ నజర్..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ యంత్రాంగం సోషల్ మీడియాపై నిఘా ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు ఆయా గ్రూపుల్లో వస్తున్న పోస్టులను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే పోస్టులు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి వివరించారు. యుద్ధానికి సంబంధించి రెచ్చగొట్టే విధంగా ఎవరు కూడా పోస్టులు పెట్టవద్దని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు ప్రార్థన స్థలాలు, మందిరాల వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

### అపరిచితులు కనిపిస్తే సమాచారమివ్వండి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడైనా అపరిచితులు కనిపిస్తే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారమివ్వాలని ఎస్పీలు కోరారు. అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలని హోటళ్లు, రెస్టారెంట్లు దాబాలకు సమాచారమిచ్చారు. మరోవైపు పోలీసులు రహదారులపై చెక్‌పోస్టులు పెట్టి వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు.

కొత్త వ్యక్తులను ఎవరినీ హోటళ్లలోకి అనుమతించవద్దని, గుర్తింపుకార్డులు ఉంటేనే వసతి కల్పించాలని కోరుతున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పోలీస్ రెవెన్యూ ఇతర శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేశారు. 24గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. కాగా, గ్రామాలు, పట్టణాల్లో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పలువురు ర్యాలీలు నిర్వహించారు. ఆర్మీ జవాన్లకు మద్దతు ప్రకటించారు. భారత్ మాతకు జై, జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు.

### భద్రతకు పకడ్బందీ చర్యలు..

దేశ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా మహబూబ్‌నగర్ జిల్లాలో ముందస్తు భద్రత చర్యలు చేపడుతున్నాం. పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. సెలవులు రద్దు చేసి 24గంటలపాటు విధుల్లో ఉంటున్నారు. ప్రజలు అనుచిత పోస్టులు, తప్పుడు సమాచారాన్ని షేర్ చేయొద్దు. దేశ భద్రత, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే చర్యలు తప్పవు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గుర్తింపు లేకుండా లాడ్జీలు, హోటళ్లలో వసతి కల్పించవద్దు.

**– డి.జానకి, ఎస్పీ**
**మహబూబ్‌నగర్ జిల్లా**

# తియ్యదనం మాటున విషం

- **మామిడిపండ్లల్లో అడ్డగోలు రసాయనాలు**
- **12 గంటల్లోనే పండ్లుగా మారుతున్న కాయలు**
- **సీజన్‌తో సంబంధం లేకుండా విక్రయాలు**
- **ఆదాయం కోసం వ్యాపారుల అక్రమమార్గం**
- **ప్రజల జీవితాలతో చెలగాటం**
- **చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు**


పెద్దకొత్తపల్లిలో కొల్లాపూర్ మామిడి పండ్లను మాగబెట్టి ట్రాన్స్‌పోర్టు చేసేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

కొల్లాపూర్, మే 8 : పండ్లల్లోనే రారాజు అయిన మామిడిని ఇష్టపడని వారుండరు. వేసవి వచ్చిందంటే చాలు మామిడిపండ్ల కోసం జనాలు ఎగబడుతారు. ఇందులో కొల్లాపూర్ మామిడి అంటేనే దేశ విదేశాల్లో ప్రత్యేకమైన గుర్తింపు, రుచికరమైన పండ్లకు కొల్లాపూర్ జియో లాజికల్ గుర్తింపు పొందింది. ఇదే అదునుగా భావించి కొందరు స్వార్థంతో కొల్లాపూర్‌తోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో మామి డి పండ్లల్లో తియ్యటి విషం నింపుతున్నారు. ఒకప్పుడు సీజన్‌లో మాత్రమే అందుబాటులో ఉండే ఫలాలు నేడు సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యం మార్కెట్‌లో అందుబాటులో ఉంటున్నాయి. కాయలు సైతం డిమాండ్‌ను బట్టి 12 గంటలల్లోనే పక్వానికి వచ్చేందుకు విషం నింపి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

### ఆదాయం కోసం అక్రమ మార్గం..

మామిడిలో అధిక దిగుబడులు రావాలని సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల నుంచి రైతులను కొందరు స్వార్థపరులు దూరం చేస్తున్నారు. కాల్షియం కార్బైడ్ రసాయనాలు ఉగ్రవాదం కంటే ప్రమాదమని కోర్టులు చెప్పినా మామిడి కాయల్లో విచ్చలవిడిగా వాడుతూ క్యాన్సర్ వ్యాధిని క్రమేనా పెంచుతున్నారు. మామిడి తోటల్లో రసాయనాల వాడకానికి ప్రధాన కారణం మామిడి కాయలను కొనుగోలు చేసే దళారులని చెప్పవచ్చు. అక్రమ మార్గంలో నిషేధిత రసాయానాలను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పర్యావరణ నిపుణులు ఆరోపిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 33,841,91 ఎకరాల్లో మామిడి తోటలు సాగవువుతున్నాయి. ఎకరా మామిడి తోటలో సగటున 2టన్నుల దిగుబడి వస్తోంది. దీనికి అనుగుణంగా కాల్షియం కార్బైట్ రసాయానాలు కూడా వందల కేజీల్లో అక్రమ మార్గంలో నిషేధిత రసాయనాలు చేరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

### కాల్షియం కార్బైడ్..

మామిడి కాయలు త్వరగా పక్వానికి తెచ్చేలా ప్రభుత్వం నిషేధించిన కాల్షియం కార్బైడ్‌ను యధేచ్చగా వాడుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ దళారులు ఇచ్చే కాసులపై పెట్టి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల నుంచి మామిడిని కొనుగోలు చేసే కేంద్రాల్లో మామిడి కాయల స్టోరేజీ కేంద్రాల్లో విచ్చలవిడిగా కాల్షియం కార్బైడ్, చైనా ఇథిలియాన్ రసాయనాలను వాడుతున్నారు.

### ఫ్రూట్ కవర్లో ఇథిలియన్ రసాయనం..

మామిడికాయలను ఆకర్షించే కలర్ వచ్చేందుకు ఫ్రూట్ కవర్స్ వాడుతున్నారు. అయితే ఈ కవర్లలో చైనా ఇథిలియన్ రసాయనాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఫ్రూట్ కవర్లలో ఉన్న మామిడిపండ్లు సహజసిద్ధంగా ఉన్న మామిడి పండ్లల్లో రుచి తేడాలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఫ్రూట్స్ కవర్‌పై తయారీ విషయంలో అధికారుల పర్యవేక్షణ కరువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### 12 గంటల్లోనే పండుగా..

చెట్టుపై ఉన్న కాయలు పండ్లుగా మారేందుకు రెండు నెలల సమయం పడుతుంది. కానీ దళారుల ఉచ్చులో పడిన మామిడి రైతులు తప్పని పరిస్థితుల్లో మామిడి కాయలపై చుక్కలు ఏర్పడే కంటే ముందే కోత కోసి విక్రయిస్తున్నారు. దళారులు మాత్రం మామిడి కాయలను సహజసిద్ధంగా మాగపెట్టకుండా కాల్షియం కార్బైడ్‌తో మాగబెడుతున్నారు. దీంతో కేవలం 12 గంటలల్లో మామిడి కాయలు పండ్లుగా మారుతున్నాయి. పక్వానికి వచ్చిన మామిడి కాయలను సహసిద్ధంగా మగపెడితే పండుగా మారేందుకు దాదాపు 5రోజుల సమయం పడుతుంది.

### రసాయన పదార్థాలు తీసుకోవద్దు..



ప్రతి వేసవిలో అందరూ ఇష్టంగా తినే మామిడిపండ్లు కాలకుట విషంగా మారుతున్నాయి. మామిడి పండ్లుగా మార్చే క్రమంలో వాడే కాల్షియం కార్బై డ్ రసాయానలతో ప్రజల ఆరోగ్యానికి పెను ముప్పు కలుగుతోందని చెప్పవచ్చు. ప్రజలు వీలైనంత వరకు ఆరోగ్యానికి ముప్పు కలిగే రసాయ న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.

**– శ్రీనివాసులు, కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్,**

# తోడేస్తున్నారు..

- **అలంపూర్ నియోజకవర్గంలో జోరుగా మట్టి దందా**
- **అక్రమంగా సొమ్ము చేసుకుంటున్న మాఫియా**
- **అనుమతుల పేరుతో అడ్డగోలుగా తవ్వకాలు**
- **పొలం రస్తాలు పాడవుతున్నాయని రైతుల ఆవేదన**

అలంపూర్, మే 8 : అలంపూర్ నియోజకవర్గంలో మట్టి దందా జోరందుకున్నది. అనుమతుల పేరుతో అక్రమ మట్టి దందాకు తెరలేపారు. మాఫియా చేతి ముడుపులకు తలూపే కొంత మంది స్వార్థపరులైన అధికారులు వారి మోచేతి నీళ్లు తాగుతున్నారు. రాత్రిల్లే కాకుండా పగలు కూడా దందా చేస్తూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అలంపూర్ నియోజకవర్గానికి చెందిన ఓ బడా నాయకుడు సంబంధిత శాఖాధికారులతో మాఫియా వారికి సంప్రదింపులు జరిపి ఎవరి వాటా వారికి సెటిల్ చేశారని పుకార్లు వినిపిస్తున్నాయి. తాజాగా మానవపాడు మండలం పెద్దపోతులపాడులో, ఉండవెల్లి మండలం శేరుపల్లె, అలంపూర్ మండలం ర్యాలంపాడు గ్రామాల్లో మాఫియా మట్టి దందా జోరుగా సాగించడమే. ఇటాచీలు పెట్టి మట్టిని తోడేస్తున్నారు. శేరుపల్లె గ్రామ శివారులో శ్రీశైలం ప్రాజెక్టు ముంపు భూములను స్వాధీనం చేసుకొని ఎర్రమట్టిని 20–40 అడుగుల లోతు వరకు తవ్వుతున్నారు. నదీ తీరం వెంట ఇలా లోతుగా గుంతలు తీయడం వల్ల మనుషులు, పశువులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, గోదాంల నిర్మాణాలు, రైల్వే పనులు, గృహ అవసరాల పేరుతో మాఫియా మట్టిని అమ్మి సొమ్ముచేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నది. మట్టి టిప్పర్లు, ట్రాక్టర్లు పగటి పూటనే కాకుండా రాత్రి సమయాల్లో కూడా తిరగడంతో ఆ శబ్దాలకు నిద్రపట్టడం లేదని క్యాతూరులో రోడ్డుపక్కన గల నివాస గృహాల వారు వాపోతున్నారు. ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చే టిప్పర్లు తెలంగాణ ప్రాంతంలో కనీస ధ్రువీకరణ పత్రాలు లేకుండా తిరుగుతూ అనుమతి లేని మట్టి, ఇసుకను, తరలిస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. అన్ని అనుమతులు ఉండి జాతీయ రహదారులపై రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లే గూడ్స్, ప్యాసింజర్ వాహనాలపై లేని నిబంధల పేరుతో పన్నులు విధించే అధికారులకు అక్రమంగా మట్టి దందాకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.


అలంపూర్‌లో టిప్పర్ ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

# భార్యను గొడ్డలితో నరికిన భర్త

- **ఆపై రైలు కింద పడి ఆత్మహత్య**

మహబూబ్‌నగర్, మే 8 : అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను గొడ్డలితో నరికిచంపి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ మండలం బొక్కలోనిపల్లిలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మూసాపేట మండలం జానంపేటకు చెందిన రాజేశ్(32) బొక్కలోనిపల్లికి చెందిన సరిత(27)తో 10ఏండ్ల కిందట వివాహమైంది. కాగా, రాజేశ్ బొక్కలోనిపల్లిలోనే అత్తగారింటికి ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. అనుమానంతో రాజేశ్ భార్యను తరుచూ వేధిస్తుండేవాడని ఎస్సై తెలిపారు. గురువారం ఉదయం ఓ వివాహానికి వెళ్లి వచ్చిన తర్వాత భార్యాభర్తల మధ్య మరోమారు గొడవ జరిగింది. మాటామాట పెరిగి ఆవేశంతో సరితను రాజేశ్ గొడ్డలితో మెడపై నరికి హతమార్చాడు. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి సమీపంలో ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. తల్లిదండ్రులు మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

ఈ మేరకు రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్సై విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు మృతురాలి తండ్రి నాగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పిచ్చికుక్క దాడి

- **చిన్నారులకు గాయాలు**

హన్వాడ, మే 8 : పిచ్చికుక్క దాడిలో ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలైన ఘటన హన్వాడ మండలంలోని వేపూర్‌లో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అంజిలయ్య కుమార్తె ఆరాధ్య, అన్సార్ కుమారుడు షోయెబ్‌తోపాటు మరో చిన్నారితో వారి ఇండ్ల వద్ద ఆడుకుంటుండగా, పిచ్చికుక్క వారిపై దాడి చేసి గాయపర్చింది. వెంటనే స్థానికులు కుక్కను తరిమివేసి గాయపడిన చిన్నారులను హన్వాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రమాదవశాత్తు కాలిన ధాన్యం


ధాన్యం చూపెడుతున్న రైతు

ఊట్కూర్, మే 8 : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా, రైతుకు తీవ్రనష్టం వాటిల్లిన ఘటన ఊట్కూర్ మండలం బిజ్వారంలో చోటుచేసుకున్నది. స్థానికులు, బాధిత రైతు కథనం ప్రకారం.. బిజ్వారం గ్రామానికి చెందిన రైతు తోక పెద్దఎల్లప్ప వారం రోజుల కిందట వరి పంటను కోసి వడ్లను పొలంలోనే ఆరబెట్టాడు. గురువారం వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు బస్తాల్లో నింపాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బస్తాలకు నిప్పు అంటుకోగా, సు మారు 40కేజీల తూకం గల 50 బ్యాగుల వడ్లు కాలిపోయినట్లు వాపోయారు. కుటుంబ సభ్యులు, రైతుల సహకారంతో మంటలను అదుపు చేశాడు.